న్యూస్‌రీల్

జనవరి 1న స్పందన రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఓ ఎం.గణపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని జిల్లాలో గల ప్రజలంతా గమనించాలని కోరారు.

శ్రీనివాసుడిగా వాసుదేవుడు



శ్రీనివాసుని రూపంలో సాక్షాత్కరించిన వాసుదేవుడు

మందస: పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ స్వామిని శ్రీనివాసునిగా దర్శించి భక్తులు పులకితులయ్యారు. ధనుర్మాసం సందర్భంగా వాసుదేవుని శనివారం అత్యంత అందంగా తిరుమల వెంకన్నలా అర్చకులు తీర్చిదిద్దారు. పుణ్యకాలం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు, ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులతో పాటు అర్చకులు సచ్చిదానంద పాడి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ జీఆర్ రాధిక జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆవిష్కరణలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, సీఐ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సురేష్, ఉమామహేష్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు రాధాకృష్ణ, భుజంగరావు, కృష్ణనాయుడు, జగదంబ తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి'



ప్రారంభించిన వైఎస్సార్ బాయ్స్ హాస్టల్ పరిశీలిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో భవన నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. భవన నిర్మాణ కమిటీ, కేంద్ర ప్రజా పనుల విభాగం ఇంజినీరింగ్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ బాయ్స్ హాస్టల్, పరిపాలన భవనం పరిశీలించారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ పరిపాలన భవనం మార్చి నాటికి పూర్తి చేసి, వర్సిటీకి అప్పగించాలని సూచించారు. వర్సిటీ మెయిన్ గేట్ నిర్మాణ డిజైన్‌పై చర్చించారు. నమూనా, అంచనా రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమీక్షలో సీపీడబ్ల్యూడీ విజయవాడ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎంవీ రావు, రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ ఈఈ పొగిరి సుగుణాకరరావు, వర్సిటీ ఇంజినీర్ అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నాగావళికి మంచు కౌగిలి

పొగమంచు పగ పట్టినట్టుంది. ప్రతి నిత్యం ఇలా నగరాన్ని కమ్మేస్తోంది. ఉదయం 9 వరకు మంచు తెరలు వీడకపోతుండడంతో నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. వేకువన మాత్రం ఇలాంటి అద్భుత దృశ్యాలను ఆస్వాదిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





సంక్షేమ నామ సంవత్సరం 2023



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం

- అపురూప ప్రగతి కార్యక్రమాలకు శ్రీకారం
- జిల్లాలో కీలక ప్రాజెక్టులు ప్రారంభం
- రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మూలపేట పోర్టుకు శంకుస్థాపన, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్‌కు అంకురార్పణ. కిడ్నీ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ సుజలధార ప్రారంభోత్సవం.. దశాబ్దాలుగా నేతలకు హామీలుగా మాత్రమే ఉపయోగపడుతున్న ప్రాజెక్టులు 2023లో కార్యరూపం దాల్చాయి. ఈ అపురూప ప్రాజెక్టులతో పాటు ఊరూవాడా సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో కళకళలాడుతున్నాయి. దీనికి సంక్షేమం కూడా జత కలవడంతో 2023 సంక్షేమ నామ సంవత్సరంగా చరిత్రలో మిగిలిపోనుంది.




ముందు వరసకు..

- వెనుకబడిన జిల్లాగా ముద్రపడిన శ్రీకాకుళం ఈ ఏడాది మాత్రం ప్రగతి పథాన ముందుకు దూసుకెళ్లింది.
- కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రబలుతున్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టి రూ. 50కోట్లతో నిర్మించిన 200పడకల కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.
- ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరుగా భావిస్తూ దానికోసం వంశధార జలాలను అందించేందుకు రూ. 700కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టును కూడా ప్రారంభించారు.
- వంశధార ఫేజ్–2లోని స్టేజ్–2 పనులు పూర్తి చేయడమే కాకుండా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ఈ ఏడాదిలోనే మంజూరు చేశారు.
- రూ. 176.35 కోట్లతో నిర్మించే ప్రాజెక్టు కోసం శంకుస్థాపన చేశారు. ఇప్పుడా పనులు జోరుగా సాగుతున్నాయి.
- ఉద్దానంలోని మహేంద్ర తనయ పై నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ. 852కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- మడ్డువలస రెండో దశ పనులకు రూ. 26.65 కోట్లు మంజూరు చేశారు. ఇవి కూడా సాగుతున్నాయి.



మూలపేట పోర్టు



వైఎస్‌ఆర్ సుజల ధార ప్రాజెక్టు

దశాబ్దాల స్వప్నం

సుదూర తీర ప్రాంతం ఉన్న జిల్లాలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు, జిల్లాలో విస్తారంగా దొరుకుతున్న ముడిసరుకులు, ఖనిజాలను ఎగుమతి చేసేందుకు మూల పోర్టుకు సీఎం వైఎస్ జగన్ ఈ ఏడాదిలో శంకుస్థాపన చేశారు. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 2,949.70కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. జిల్లాకే తలమానికంగా నిలిచిపోతుంది. మత్స్యకారుల కోసం రూ.365.81కోట్లతో బుడగట్లపాలెంలో పిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. ఇదే ఏడాదిలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ రెండు పూర్తయితే మత్స్యకారుల వలసలు దాదాపు ఆగిపోతాయి. ఇక్కడే ఉపాధి, ఉత్పత్తి పెరిగి జిల్లాకు ప్రధాన ప్రాజెక్టులుగా నిలిచిపోనున్నాయి.

ప్రధాన ప్రాజెక్టులు కాకుండా రోడ్లు, వంతెనలు ఇతరత్రా పూర్తయి వందలాది గ్రామాల రహదారి సమస్య తీరింది. సంక్షేమమైతే చెప్పనక్కర్లేదు. దాదాపు 27డీబీటీ పథకాలతో పాటు నాన్ డీబీటీ పథకాలు లక్షలాది ఇళ్లల్లో వెలుగులు నింపాయి. ఏ ఒక్క పథకం ఆగకుండా అర్హులైన అందరికీ అందింది. కళ్ల ముందు జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రతిపక్ష టీడీపీ కడుపు మంటతో దుష్ప్రచారాలకు కూడా దిగింది. మాయమాటలు చెప్పుకుని రానున్న ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని చూస్తోంది.

1 నుంచి రూ.3వేల పింఛన్



శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పెన్షన్ కానుక కింద జనవరి 1 నుంచి రూ.3వేలు చొప్పున లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లాలోని పలు ముఖ్య శాఖల అధికారులతో శనివారం సాయంత్రం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జనవరి 1 నుంచి 9వ తేదీ వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా జనవరి 24 నుంచి 31వరకు, వైఎస్సార్ చేయూత ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాలకు శాసన సభ్యులు ప్రతి మండలంలో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. 8 రోజులకు ఒక షెడ్యూల్ తయారు చేసుకోవాలని, ప్రీ లాంచ్, లాంచ్ డే, పోస్ట్ లాంచ్ మూడు దశల్లో జరుగుతుందన్నారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించే జనవరి 19వ తేదీన అన్ని సచివాలయాల్లో సోషల్ జస్టిస్ పేరుతో బోర్డు ఏర్పాటు చేసి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. వైఎస్సార్ పెన్షన్, ఆసరా, చేయూతలకు సంబంధించి విజయ గాథలను వీడియో రూపంలో అప్‌లోడ్ చేస్తే సచివాలయం స్థాయిలో రూ.10 వేలు, మండల స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేల ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు.

'కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు సూచించారు. శ్రీకాకుళంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం పీపీలతో సమావేశం నిర్వహించారు. సివిల్ లిటిగేషన్, క్రిమినల్ కేసులకు సంబంధించి విచారణ చేసేటప్పుడు సివిల్ లాస్, సంబంధించిన ఇతర చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యామిలీ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణ చంద్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు, సరైన పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



వర్చువల్ విధానం ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. నార్కో కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కన్వీనర్ ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్ విధానం ద్వారా జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కలెక్టర్, ఎస్పీ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రానున్న మూడు నెలల్లో ఎక్కడెక్కడ ఎంతమంది సిబ్బంది అవసరమో చూసుకుని కేటాయించి నాటు సారా నిర్మూలనకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో గంజాయి ఉత్పత్తి లేనప్పటికీ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా జరిగే అవకాశం ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అదే రాష్ట్రం నుంచి అక్రమ మద్యం నియంత్రించేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అధికారులు పాఠశాలలు, కళాశాలల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లా సరిహద్దు కేంద్రాల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాల తనిఖీ చేస్తున్నామన్నారు. ఇచ్ఛాపురం, పాతపట్నం, చెక్‌పోస్టులతో పాటు అదనంగా మరో రెండు చెక్‌పోస్టులను కొత్తూరు, మెళియాపుట్టి వద్ద ఏర్పాటు చేసి భద్రత మరింత పెంచుతున్నట్లు తెలిపారు. 19 కేంద్రాల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఇతరత్రా వినియోగం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో సెబ్ జేడీ వి.ఎస్.మణికంఠ, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ అనురాధ, ఆర్టీసీ డీఎం పీబీ మల్లికార్జునరావు, రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు, సెబ్ సీఐ నాగేశ్వరరావు, వర్చువల్ ద్వారా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'పీవీటీజీల అభివృద్ధికి కృషి'



కొత్త బాలేరులో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న బిస్మితా దాస్, పీఓ కల్పనాకుమారి

హిరమండలం: పీవీటీజీ జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి బిస్మితా దాస్ తెలిపారు. శనివారం లోకొండ, కొత్త బాలేరులో ఐటీడీఏ పీఓ కల్పనాకుమారితో కలిసి పర్యటించారు. పీఎం జన్మన్ పథకం ద్వారా పీవీటీజీ గ్రామాల్లో తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలతో పాటు గృహనిర్మాణం, విద్య, వైద్యసేవలు మరింత మెరుగు పరచనున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని పీవీటీజీలకు సంబంధించి వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టుదే ఆధిపత్యం



ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎస్పీ చేతులమీదుగా అందుకుంటున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2023 శనివారంతో ముగిసింది. ఆర్మ్‌డ్ రిజర్వ్, శ్రీకాకుళం, కాశీబుగ్గ, టెక్కలి సబ్‌డివిజన్లు, హోంగార్డు జట్లు పాల్గొన్నారు. ఉత్సాహంగా పోలీసులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ జీఆర్ రాధిక బహుమతులు ప్రధానం చేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలో ఐక్యత, స్నేహభావాలు వృద్ధి చెందుతాయని అన్నారు. వాలీబాల్, క్రికెట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్లు, కబడ్డీలో కాశీబుగ్గ సబ్ డివిజన్, టగ్ ఆఫ్ వార్‌లో టెక్కలి సబ్ డివిజన్ జట్లు విజేతలుగా నిలిచాయి. అథ్లెటిక్స్ వ్యక్తిగత చాంపియన్‌గా హోంగార్డు విశ్వనాథం నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు కైవసం చేసుకుంది. విజేతలు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు వీఎస్ మణికంఠ, టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు శృతి, ప్రసాదరావు, రాజా, బాలరాజు, బాలచంద్రా రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బి.జాన్ వెస్లీ, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ప్రత్తి అన్వేష్, బిషప్ బింకం బర్నబాస్, రెవరెండ్ జి.శామ్యూల్ అరుణ్ కుమార్, జాన్ జీవన్, బిసప్ జాన్ డేవిడ్, బిషప్ కణితి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు త్రిపురాన విగ్రహావిష్కరణ



త్రిపురాన రాఘవదాసు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు త్రిపురాన రాఘవదాసు విగ్రహాన్ని శాంతి నగర్ కాలనీలోని గాంధీమందిరంలో శనివారం మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీపిలుపు మేరకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేశారని అన్నారు. స్వాతంత్య్ర యోధుల స్మృతి వనంలో తన తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ముందుగా త్రిపురాన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిరం సభ్యులు పాల్గొన్నారు.

పోలాకి విద్యార్థినికి కౌశల్ ప్రతిభా అవార్డు



కౌశల్ ప్రతిభ అవార్డును అందుకుంటున్న మనీషా

పోలాకి: రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభ అన్వేషణ పోటీ పరీక్షలో పోలాకి విద్యార్థిని పాలకొండ మనీషా ఉత్తమ అవార్డును అందుకుంది. మనీషా ఈదులవలస ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శనివారం విజయవాడ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్స్‌లో నిర్వహించిన పోటీల్లో మనీషా పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయులు రాంబాబు తెలిపారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎస్‌ఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా మనీషా ఉత్తమప్రతిభా అవార్డును అందుకుంది.

'పీఎస్‌ఈల తొలగింపులో అలసత్వం వద్దు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితా నుంచి ఫొటో సారూప్య (పీఎస్‌ఈ) నమోదులు, డేటా సారూప్య నమోదులు (డీఎస్‌ఈ) తొలగించడంలో ఎలాంటి అలసత్వం పనికి రాదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈఆర్వో, ఏఈఆర్వోలతో శనివారం మధ్యాహ్నం ఆయన జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2024పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఒకే ఫొటోతో రెండు అంతకు మించి ఉన్న ఓట్లను తొలగించడం లేదా సరి చేయడంలో ఇచ్ఛాపురం, సోంపేట, ఎచ్చెర్ల తహసీల్దార్లు నిర్లక్ష్యం వహించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా చాలా చోట్ల ఒకే ఇంటి నంబర్‌తో ఉన్న ఓట్లను సరి చేయాలన్నారు. క్లెయిముల పరిష్కారానికి జనవరి 12ను ఎలక్షన్ కమిషన్ డెడ్‌లైన్‌గా విధించిందని, జనవరి 22న పూర్తి స్థాయి ఓటర్ల జాబితా ప్రచురణ ఉందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

'భద్రతా ప్రమాణాలు తప్పనిసరి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం జరిగిన జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. అమోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రత ప్రమాణాలు ఉండాలన్నారు. ఏటా మాక్ డ్రిల్ నిర్వహించాలని, విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇటీవల కాలంలో విశాఖ జిల్లాల్లో పలు పరిశ్రమల్లో భద్రతా వైఫల్యాల కారణంగానే ప్రమాదాలు వాటిల్లాయని, అలాంటి వాటిని కట్టడి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు.

అద్వితీయ రీతిలో..

- జనవరి 1 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష
- జిల్లాలో 669 వైద్య శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రతి రోగికి నయమయ్యేంత వరకు ఉచిత చికిత్స అందించేలా చర్యలు



అరసవల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మరోసారి జిల్లాలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలు చేస్తున్న ఈ కార్యక్రమం తొలి విడత దిగ్విజయంగా పూర్తి చేసుకోగా.. తాజాగా జనవరి 1 నుంచి రెండో విడత సేవలందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి విడతలో మొత్తం 637 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయగా, 2,67,800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వందలాది మందికి ఉచితంగా మందులు అందజేశారు. దీంతో రెండో విడతలో మరింత మంది పేదలకు సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో నూతన సంవత్సరం తొలి రోజు నుంచే ఆరు నెలల పాటు (జనవరి 1 నుంచి జూన్ 30 వరకు) జిల్లాలో మొత్తం 669 వైద్యశిబిరాలను కచ్చితంగా నిర్వహించేలా అధికారులు సన్నాహాలు చేశారు.

669 క్యాంపులు..

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)–2వ విడతలో కూడా గ్రామీణ ప్రాంతాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లోనూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడతలో మొత్తం 637 వైద్యశిబిరాల్లో 2,67,800 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందులను పంపిణీ చేయగా, ఇప్పుడు ఏకంగా 669 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి మరింత మందికి ఉచితంగా అవసరమైన వైద్య సేవలు, ఉచిత మందులను పంపిణీ చేసేలా సిద్ధమవుతున్నారు. ఇక జిల్లాలో 30 మండలాల్లో ఒక్కో మండలానికి వారానికి 34 క్యాంపులు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేసుకున్నారు. 15 మండలాల్లో మంగళవారం, మరో 15 మండలాల్లో శుక్రవారాల్లో ఈ మెడికల్ క్యాంపులను సచివాలయాల వారీగా ఏర్పాటు చేయనుండగా, మున్సిపాలిటీ అర్బన్ ప్రాంతాల్లో ప్రతి బుధవారం వార్డు సచివాలయాల వద్ద మెడికల్ క్యాంపులను నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు.

ఈ జనవరి నెలాఖరులోగానే 147 మెడికల్ క్యాంపులను జిల్లా వ్యాప్తంగా జరిపించేలా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ప్రతి మెడికల్ క్యాంపులోనూ ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆఫ్తాలమిక్ వైద్యునితో కలిసిన బృందం వైద్య సేవలు అందించనున్నారు. ఇక తొలి విడతలాగానే ఈ శిబిరాల్లో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి కేస్ షీట్స్ సిద్ధం చేయనున్నారు.

ఇవే కాక ప్రతి శిబిరంలోనూ కంటి వైద్య పరీక్షలు కూడా చేసేలా ప్రత్యేక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 91 రకాల మందులను, అర్బన్ ప్రాంతాల్లో 172 రకాల మందులను ఉచితంగా అందించేలా మెటీరియల్ సిద్ధం చేసుకున్నారు.

మరో అద్భుత అవకాశం



గడప గడపకూ ప్రభుత్వ వైద్యం అందించే అద్భుత అవకాశం మరో సారి రానుంది. జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని సోమవారం నుంచి మొదలుపెట్టనున్నాం. మొత్తం 30 మండలాల్లో రానున్న ఆరు నెలల్లో 669 మెడికల్ క్యాంపులను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ జనవరి నెలాఖరులోగా 147 క్యాంపులను పూర్తి చేయనున్నాం. లక్షలాది మంది రోగులకు మేలు కలిగేలా ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం డిజైన్ చేశారు. మొదటి విడతలో జిల్లాలో మొత్తం 637 వైద్య క్యాంపులు పూర్తి చేయగా..ఇప్పుడు 669 క్యాంపులను నిర్వహించనున్నాం.

– డాక్టర్ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

సరిహద్దు నేరాలు అరికడదాం: ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, గజపతి ఎస్పీ స్వాతికుమారి

శ్రీకాకుళం క్రైమ్ : అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ముమ్మర చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బరంపుర్ ఎస్పీ శరవణ వివేక్, గజపతి జిల్లా ఎస్పీ స్వాతి కుమారిలతో కలిసి శనివారం ఆమె అంతర్‌రాష్ట్ర సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాం (బరంపుర్) ఎస్పీ శరవణ వివేక్ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా 115 కిలోమీటర్ల సరిహద్దును గజపతి, గంజాం జిల్లాలతో కలిగి ఉందని, ఎనిమిది పోలీస్‌స్టేషన్లు, ఆరు సెబ్ పోలీసు స్టేషన్లు సరిహద్దులో జరుగుతున్న నేరాలపై పటిష్ఠ నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లోని 53 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు తమ వంతుగా సహకారం అందించాలని వారిని కోరారు. జిల్లాలో నాలుగు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని, ఆయా చెక్‌పోస్టుల ఇవద్ద 24 గంటలూ అప్రమత్తంగా ఉండి స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించి విస్తృతంగా వాహన తనిఖీలు చేపడతామన్నారు. దీనికి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో జిల్లా అదనపు ఎస్పీ (జేడీ) విజయ నాగమణికంఠ, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీలు డి.బాలచంద్ర, నాగేశ్వరరెడ్డి, కె.బాలరాజు, సీఐలు ఈశ్వర ప్రసాద్, శంకరరావు, వినోద్‌బాబు, వేణు గోపాల్, గజపతి జిల్లా డీఎస్పీ మధనబంద నాయక్, ఇన్‌స్పెక్టర్స్ ప్రసన్న భూపతి, గోవింద్, రీన రాణి, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపికలు ప్రారంభం



హాజరైన క్రికెట్ క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: తమిళనాడు రాష్ట్రంలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ విశ్వవిద్యాలయంలో జనవరి 7 నుంచి 16వ తేదీ వరకు సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ విజయనగరం విశ్వవిద్యాలయం పరిధిలోని క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ చిలకపాలేంలో శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం ప్రారంభించారు. ఈ ఎంపిక ప్రక్రి యను జేఎన్‌టీయూ విజయనగరం పాలక మండలి సభ్యులు దుప్పల వెంకటరావు ప్రారంభించారు. జేఎన్‌టీయూ పరిధిలోని 16 కళాశాలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సెలెక్టర్లు పీఎస్‌వీ రమణ, లక్ష్మణ్‌మూర్తిలతో కూడిన బోర్డు 30 మందిని ఎంపిక చేసింది. వీరిలో ఆదివారం 15 మందిని ఎంపిక చేయనున్నారు. ఈ 15 మంది సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీని వాసరావు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల టెన్నీకాయిట్ పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డులు అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో 41వ రాష్ట్ర అంతర్ జిల్లాల స్త్రీ,పురుషుల టెన్నీకాయిట్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో గెలుపొందిన విజేతలు పీజేఎండీ రామారావు(తూర్పు గోదావరి), వి.వినయ్ కుమార్(తూర్పు గోదావరి), సీహెచ్ తారకేశ్వరరావు(శ్రీకాకుళం), ఎల్.త్రిమూర్తిలు(తూర్పు గోదావరి), కె.వంశీ(పశ్చిమ గోదావరి), బి.చంటి(పశ్చిమ గోదావరి), పి.జగదీష్(శ్రీకాకుళం), బాలికల విభాగంలో గెలుపొందిన విజేతలు ఆర్.మౌనిక(విజయనగరం), పి.రేణుక(విజయనగరం), ఎం.ప్రవల్లిక(విజయనగరం), జి.శ్రావణి(విజయనగరం), జి.అమృత(అనకాపల్లి), ఎస్.పల్లవిశ్వేత శ్రీ(విశాఖపట్నం), కె.మౌనిక(పశ్చిమ గోదావరి), వై.అలేఖ్య(పశ్చిమ గోదావరి) గెలుపొందారని జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెన్ని శేఖరబాబు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు టెక్కలి డిప్యూటీ డీఈఓ పగడాలమ్మ, వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర టెన్నీ కాయిట్ జనరల్ సెక్రటరీ పి.తవిటయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నల్లి రాజారావు, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అధ్యక్షుడు గురాడ అప్పన్నల చేతులమీదుగా సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందించారు.

ఎస్‌జీటీలకు హెచ్‌డబ్ల్యూఓలుగా అవకాశం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా అవకాశం కల్పించనున్నారు. అర్హులైన ఎస్‌జీటీలు వచ్చేనెల 5వ తేదీలోగా ట్రైబల్‌వెల్ఫేర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి శనివారం ఓ ప్రకటనలో కోరారు.

ఎన్నికల లబ్ధి కోసమే తప్పుడు స్టేట్‌మెంట్లు

- అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు జిల్లాకు చేసిందేమీ లేదు
- కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్



మాట్లాడుతున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

కోటబొమ్మాళి: ఎన్నికల లబ్ధి కోసమే టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని, జిల్లాలో జరిగిన అభివృద్ధిపై వారిద్దరూ టెక్కలి లేదా పలాసలో చర్చకు రావాలని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్ విసిరారు. ఆయన శనివారం కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామంలోని ఎంపీటీసీ అన్నెపు రామారావు ఇంటిలో విలేకరులతో మాట్లాడారు. మూలపేట పోర్టు పనుల పరిశీలనకు వచ్చిన వైవీ సుబ్బారెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్‌లపై ఎంపీ రామ్మోహన్ నాయుడు విమర్శలు చేశారని, ఎంపీ గానీ, ఆయన బాబాయ్ అచ్చెన్న గానీ జిల్లా అభివృద్ధి గురించి ఏనాడూ ఆలోచించలేదని దుమ్మెత్తిపోశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం ప్రాంతానికి తాగునీటి శుద్ధజలాలు, మూలపేట పోర్టు, నందిగాంలో ఆఫ్‌షోర్‌కు రూ.850 కోట్లు, ఇచ్చారని గుర్తు చేశారు. భావనపాడు పోర్టుపై కింజరాపు కుటుంబ సభ్యులు పబ్లిసిటీ చేసుకోవడం తప్ప ఏనాడూ పని చేయలేదని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం రాష్ట్రానికి 11 జాతీయ ప్రాజెక్టులు మంజూరు చేస్తే.. జిల్లాకు ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, ఎంపీటీసీలు అన్నెపు రామారావు, బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు పంకు సింహాచలం, బొమ్మాళి రాము, నాయకులు దుక్క రామకృష్ణ, పేడాడ వెంకటరావు, ఎస్.వినోద్, జీరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ సేవలు ప్రశంసనీయం: వీసీ



రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రగతికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ చేసిన సేవలు ప్రశంసనీయమని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ రెండేళ్ల టర్మ్ ఆదివారంతో ముగియడంతో ఆయన రిలీవ్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వీడ్కోలు సభ నిర్వహించి ఆయనను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ రెండేళ్ల పాటు విద్య బలోపేతం, మెరుగైన పాలన, మౌలిక వసతుల కోసం రిజిస్ట్రార్ శ్రమించారని అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జిగా కళాశాలను ప్రగతి పథంలో నిలబెట్టారని తెలిపారు. రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు అందరూ సహకారం అందజేశారని అన్నారు. సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి సాధిస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో జాతీయస్థాయిలో ఉత్తమ వర్సిటీలో బీఆర్ఏయూ మారుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ సీహెచ్ రాజశేఖర్‌రావు, హానరీ ప్రొఫెసర్ టి.కామరాజు పాల్గొన్నారు. అన్ని విభాగాలు సిబ్బంది సన్మానం చేసి, జ్ఞాపకలు అందజేశారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఐదుగురు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ బేస్‌బాల్ పోటీలకు శ్రీకాకుళం నుంచి రికార్డు స్థాయిలో ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు 2024 జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ వేదికగా జరగనున్నాయి. అంతకుముందు జరిగిన 67వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు అత్యద్భుతంగా రాణించడంతో జాతీయ పోటీలకు నేరుగా ఎంపికయ్యారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన వారిలో బి.హరిసింహాద్రి (జెడ్పీహెచ్‌స్కూల్ ఇప్పిలి), బి.నవీన్ (జెడ్పీహెచ్‌స్కూల్ ఇప్పిలి), కె.మనోహర్ (జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరావుపేట), టి.లావణ్య (చైతన్య సహకార జూ.కళాశాల శ్రీకాకుళం), బి.ప్రవల్లిక (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ పెద్దపాడు) ఉన్నారు. వీరంతా ఈ పోటీల కోసం ఆదివారం ఇక్కడ నుంచి పయనమై వెళ్తున్నారు. ఎంపికైన క్రీడాకారులను, వీరిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, పీడీలను ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, అభినందించారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

టెక్కలి రూరల్: తన కుమార్తెను ఓ యువకుడు వేధిస్తున్నాడని టెక్కలి కోదండరామవీధికి చెందిన ఓ మహిళ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే వీధికి చెందిన మెట్ట రామారావు అనే యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ–2 రమేష్ బాబు తెలిపారు.

సృజనకు వేదిక

- అబ్బురపరిచిన అటల్ టింకరింగ్ ల్యాబ్
- పెదపాడు గురుకుల పాఠశాలలో ఏటీఎల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



శ్రీకాకుళం రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రతి స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఓ బాలాజీ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెదపాడులో గల బాలికల అంబేడ్కర్ గురుకులంలో శనివారం ఏర్పాటు చేసిన ఏటీఎల్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వస్తువులు తిలకించి అబ్బురపడ్డారు. కార్యక్రమంలో పెదపాడు స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, మాధవీలత, దుప్పలవలస ప్రిన్సిపాల్ దేవేందరావు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పేరు
ఎల్‌ఈడీ నోటీసు బోర్డు
విద్యార్థి: బి. అమృత (9వతరగతి)



ఎల్‌ఈడీ నోటీసు బోర్డును వైర్‌లెస్ బ్యాటరీతో బ్లూటూత్‌కు టెర్మినల్ ద్వారా అనుసంధానం చేసి డిస్‌ప్లే ద్వారా చూడవచ్చు. మనకు కావాల్సిన డిస్‌ప్లేను కూడా మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్ గుండా కనెక్ట్ చేసి చూసుకునేందుకు వెసులుబాటు ఉంది.

ప్రాజెక్టు పేరు
జాయ్ స్టిక్ బేస్డ్ వీల్ చైర్
విద్యార్థి: దీపిక, 10వ తరగతి



ఇది దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. మనకు అనుగుణంగా ఏవిధంగానైనా దీన్ని ఆపరేట్ చేసుకోవచ్చు. బ్యాటరీతో నడుస్తుంది.

ప్రాజెక్టు పేరు
ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్
విద్యార్థులు: ఎస్.స్వప్న, బి.ప్రసన్న (8వతరగతి)

ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ఉదయం సన్‌లైట్‌తో చార్జింగ్ చేసుకుంటుంది. రాత్రి ఆటోమేటిక్‌గా వెలుగుతుంది. చార్జ్ పూర్తయ్యాక ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది.

ప్రాజెక్టు పేరు
హార్ట్‌బీట్ టెంపరేచర్
విద్యార్థి: బి.హాసిని, 7వతరగతి

హార్ట్‌బీట్ టెంపరేచర్ సెల్‌ఫోన్‌కు బ్లూ టూత్ ద్వారా కనెక్ట్ చేసుకోవచ్చు. సెన్సార్ ద్వారా హార్ట్ బీట్ ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు.





ప్రాజెక్టు పేరు : క్లాప్ సెన్సార్
విద్యార్థులు : బి.రుహాన్సీ, వై.మేఘన (8వతరగతి)

సౌండ్ సెన్సార్ ద్వారా లైట్స్‌ను ఆఫ్, ఆన్ చేసుకోవచ్చు. చప్పట్లు కొడుతూ కూడా లైట్స్ ఆన్ ఆఫ్ చేసుకోవచ్చు. ఇది మైక్రో కంట్రోల్ ద్వారా పనిచేస్తుంది. ఈ సెన్సార్ ద్వారా టెలివిజన్, ఫ్యాన్, రేడియోలను కూడా ఆపరేట్ చేయవచ్చు.